క్లుప్తంగా

నియామకం



బోయిని రాజయ్య

భూపాలపల్లి రూరల్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) జిల్లా అధికార ప్రతినిధిగా మల్హర్ మండలానికి చెందిన బోయిని రాజయ్య యాదవ్ నియమిస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధికార ప్రతినిధిగా ఎన్నికైన బోయిని రాజయ్య యాదవును నియమించడంపై జిల్లాలోని యాదవ సంఘాల నాయకులు, యాదవ కులస్తులు తెలంగాణ ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సన్మానం

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సబ్ ఇంజనీర్ పైసా హరీశ్ ములుగు జిల్లాకు, లైన్‌మెన్ రఘు టేకుమట్లకు, మొట్లపల్లి లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గణపురానికి బదిలీ కాగా సోమవారం వారిని మండల విద్యుత్ ఉద్యోగులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు, మాజీ సర్పంచ్ మోటె ధర్మారావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వేతనాల పెంపుపై హర్షం

మొగుళ్లపల్లి: టీజీ ఎన్పీడీసీఎల్ కంపెనీలో విద్యుత్ ఆన్‌మ్యాన్డ్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న వారికి వేతనాలు పెంచడం హర్షణీయమని తెలంగాణ విద్యుత్ ఆన్‌మ్యాన్డ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కిరణ్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, ఐఎన్టీయూసీ 327 యూనియన్ సెక్రటరి జనరల్ శ్రీధర్‌కు కిరణ్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ



రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండల కేంద్రానికి చెందిన బమ్మ పోశాలు ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సోమవారం పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా నాయకులు పుల్లూరి బాబురావు, కాటం సదయ్య, జోరు సుదర్శన్, రమేశ్, ఓమాజీ ఉన్నారు.

ఆర్థిక సాయం



టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు తిరుపతి సోమవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆయనను మాజీ ఎంపీటీసీ ఆది రఘు పరామర్శించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని అనంతరం వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట మాజీ ఉప సర్పంచ్ నిమ్మల స్వామి, కారోబార్ మేకల అశోక్ ఉన్నారు.

కొత్త పింఛన్ల జారీలో ప్రభుత్వ నిర్లక్ష్యం



శాయంపేట : కొత్త పింఛన్ల దరఖాస్తుదారులకు ఇప్పటి వరకు పింఛన్ మంజూరు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్ కళ్యాణ్ విమర్శించారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన ఏబీఎస్ఎఫ్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వితంతువులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకొని ఏళ్లు గడుస్తున్నా పింఛన్ రాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని అన్నారు. గత ప్రభుత్వంలోనూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోను వితంతువులకు అన్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక రూ. 4వేల పెన్షన్ ఇస్తామని ప్రకటించి అధికారం చేపట్టి పది నెలలు గడిచిన కాలయాపన చేస్తోందన్నారు. కొత్త పింఛన్ దరఖాస్తుదారులకు వెంటనే పింఛన్ మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ. 4వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. నాయకులు సుమన్, రాజు, రమేశ్, వినయ్ పాల్గొన్నారు.

ఔషధాలే.. ఆహారం

విపరీతంగా మాత్రలు మింగుతున్న ప్రజలు

- దెబ్బతింటున్న ఆరోగ్యం
- బీపీ, మధుమేహం, గుండె, శ్వాస సంబంధిత వ్యాధిగ్రస్తులే అధికం



తాడిచర్ల పీహెచ్‌సీలో బీపీ చెక్ చేస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

మల్హర్: ఒకప్పుడు తీవ్రమైన జబ్బులు వస్తేనే మందు గోలీల వాడకం ఉండేది. నేటి ఉరుకులు పరుగుల జీవితంలో మనిషి తన ఆరోగ్యాన్ని గాలికి వదిలి వేస్తున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆహారాన్ని ఔషధంగా తీసుకునే స్థాయి నుంచి ఔషధాలే ఆహారంగా తీసుకునేలా తయారయ్యారు. లేచినప్పటి నుంచి నిద్ర పోయేవరకు బీపీ, మధమేహం, గుండె, శ్వాస సంబంధిత వ్యాధులు మనిషిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఒకప్పుడు షుగర్ వ్యాధి అనేది యాభైఏళ్ల పైబడిన వాళ్లకు మాత్రమే వచ్చే అవకాశాలు ఉండేవి. కాని నేడు అప్పుడే పుట్టిన పిల్లల్లో సైతం డయాబెటిస్ వ్యాధి బారిన పడుతుండటం ఆందోళన కలిగించే అంశం. జీవన శైలిలో మార్పులు, మనిషి జీవితాన్ని నాశనం చేస్తున్నాయి. ఆహార నియమాలు పాటించకపోవడం, చెడు అలవాట్లకు బానిసకావడంతో వ్యాధులు కబలిస్తున్నాయి. ఆరోగ్య సూత్రల మీద అవగాహన లేమి కారణంగా విచ్చల విడిగ మాత్రలు మింగిస్తున్నాయి. ప్రజలు ఉదయం భోజనం కంటే ముందే మందులు తీసుకోవాల్సి వస్తుంది. ఈ రకమైన మందులు వాడే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది.

మండలంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, 8 సబ్‌సెంటర్ కొనసాగుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలో రోజుకు 30 నుంచి 100 మందికి పైగా ఓపీకి వస్తుంటారు. దీనికి తోడు జిల్లా కేంద్రంతో పాటు ఇతర జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులకు బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సలకు ఓపీకి తరలివెళ్తుంటారు. ఇందులో అధికంగా బీపీ, మదమేహం, అస్తమ తదితర రోగాల వారే అధికంగా ఉంటారు. మండలం వ్యాప్తంగా బీపీ 1102 మంది, షుగర్ 638 మంది గోలీలు వాడుతున్నట్లు తెలిసింది. సుమారు 200 మందికి పైగానే చికిత్సల నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రులకు తరలి వెళ్తున్నట్లు సమాచారం.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



అందరికి ఆరోగ్య సూత్రాలు తెలుసు. కానీ పాటించే వారు కనీసం రెండు శాతం మంది కూడా లేరు. చిన్న చిన్న అజాగ్రత్తలతో ఎంతో మంది అనారోగ్యల పాలవుతున్నారు. ఆరోగ్య నియమాలు పాటించకపోవడంతో జబ్బులను కొని తెచ్చుకోవాల్సిన దుస్థితి వస్తోంది. కచ్చితంగా ఆరోగ్య సూత్రాలు పాటించాలి. బయటి ఫుడ్‌కు అలవాటు పడ కూడదు. డాక్టర్ సలహాలు, సూచనలు లేకుండా మాత్రలు మింగకూడదు.

– రాజు, డాక్టర్, తాడిచర్ల పీహెచ్‌సీ

కులమత బేధాలు లేకుండా గ్యార్మి పండుగ



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: కులమత బేధాలు లేకుండా ఎంతో ఘనంగా ముస్లింలు గ్యార్మి పండుగను నిర్వహించుకుంటారని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లోని హజ్రత్ సయ్యద్ మీరా హుస్సేన్ దర్గా షరీఫ్‌లో నిర్వాహకులు పసిక రాజశేఖర్ (హైదర్ గురు) ఆధ్వర్యంలో గ్యార్మి షరీఫ్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై 16వ వార్డు కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు దర్గా నిర్వాహకులు ఎమ్మెల్యేకు పూలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న పోలీసులు

మొగుళ్లపల్లి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితునికి పోలీసులు అప్పగించారు.ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ములకలపల్లి గ్రామానికి చెందిన ఓనపాకల రాజు అనే యువకుడు ఫోన్‌ను ఆదివారం పోయిందని సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తక్షణమే స్పందించి ఫిర్యాదు అందిన రెండు గంటల వ్యవధిలోనే పోగొట్టుకొన్న ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రాప్ చేసి బాధితునికి అప్పగించినట్లు వివరించారు. అతి తక్కువ సమయంలో ఫోన్ వెతికి తీసుకువచ్చి అప్పగించిన మొగుళ్లపల్లి పోలీసు బృందానికి యువకుడు కృతజ్ఞతలు తెలిపాడు.

ఇందిరమ్మ గ్రామ కమిటీ ఎన్నిక

మొగుళ్లపల్లి: ఇందిరమ్మ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కాంగ్రెస్ పార్టీ మొగుళ్లపల్లి పట్టణ అధ్యక్షుడు క్యాతరాజు రమేశ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రం శివారులోని సమ్మక్క–సారలమ్మ ఆలయ ప్రాంగణంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందిరమ్మ గ్రామ శాఖ సభ్యులుగా క్యాతరాజు విజయ, మోరె రమాదేవి, నడిగోటి రాము, పడిదల ప్రకాశ్‌రావు, బండారి కొమురయ్యను ఎన్నుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రఫీ, నాయకులు ఎర్రబెల్లి పున్నంచంద్రావు, ఏలేటి శివారెడ్డి, మల్సాని రాజేశ్వర్రావు, మోరె జయపాల్‌రెడ్డి, అన్నారెడ్డి, బిక్షపతి, శ్రీనివాస్, మహేందర్, నరేశ్, తిరుపతి, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న నరేష్

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల గ్రామం పారిశ్రామికంగా ముందడుగులు వేస్తున్న తరుణంలో తాడిచర్లలో పోలీస్ స్టేషన్–2ను ఏర్పాటు చేయాలనిని ఏమ్మార్పీస్ నాయకులు జిల్లా ఎస్పీ, కాటారం డీఎస్పీ, సీఐలను సోమవారం కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తాడిచర్ల మేజర్ గ్రామ పంచాయతీలో సమస్యలు ఎక్కువగా ఉంటాయని, ఇక్కడ యువత చెడు అలవాట్లకు ఆకర్షితులు అవుతున్నారుని తెలియజేశారు. ఉన్నతాధికారులు మండల అధికారులు, జిల్లా అధికారులు ఆలోచించి మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ప్రారంభించాలని కోరారు. మల్హర్ మండల అధ్యక్షుడు, భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కేసారపు నరేష్ మాదిగ, మండల కోశాధికారి తాండ్ర దినేష్ మాదిగ, యూత్ నాయకులు ఖమ్మంపల్లి సందీప్ మాదిగ, ఇందారపు సమ్మయ్య మాదిగ, ఇందారపు అరుణ్ మాదిగ, ఇందారపు సిద్దు, ఇందారపు రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008–09 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పలకరింపులు, ఆలింగనాల నడుమ ఆనాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు గంగిశెట్టి వెంకటేశ్వర్లు, బత్తుల సదానందం, దేవేందర్ రావు, ఇంద్రాదేవి, రఘుపతి, రవిలను శాలువతో ఘనంగా సన్మానించారు. 16 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులందరూ ఒకే చోట చేరడంతో సందడి నెలకొంది. పూర్వ విద్యార్థులు సునీల్, అఫ్జల్, తిరుపతి, అనిల్, మాధవరావు, సంధ్య, అమూల్య, అనూషతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



టేకుమట్లలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

టేకుమట్ల/చిట్యాల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహేబ్ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఏవైఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య అన్నారు. సోమవారం టేకుమట్ల, చిట్యాల మండల కేంద్రాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల వివక్ష నిర్మూలనకు బౌద్ధమే శరణ్యమన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ఆయన హిందువుగానే పుట్టి, హిందువుగానే మరణించనని, అన్ని మతాల సారంశం ఎక్కటేనని అన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏవైఎస్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు ఉన్నారు.

సాయిబాబా మృతి తీరనిలోటు



సాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: ప్రొఫెసర్ సాయిబాబా మృతి సమాజానికి తీరని లోటు అని అన్నారు సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుక్ ప్రవీణ్ తెలిపారు. పట్టణంలోని భగత్ సింగ్ కాలనీలో సీపీఐ పట్టణ కమిటీ కార్యాలయంలో ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి సోమవారం పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. చేయని తప్పుకు పది సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించి నిర్దోషిగా రిలీజ్ అయ్యారని అన్నారు. రిలీజ్ అయిన ఏడు నెలలకు అనారోగ్యంతో మృతి చెందారని, సాయిబాబా ఆదివాసీలు, దళితులు, విద్యార్థులు, రైతులు, కార్మికుల పక్షాన అనేక పోరాటాల నిర్వహించిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ నాయకులు పీక రవి, బుపేల్లి రామచందర్, భాస్కర్, రమేష్ చారి, రాజులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న పోలీసులు

కాళేశ్వరం: నేర నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాత కీలకమని మహదేవపూర్ సీఐ రామచంద్రారావు అన్నారు. సోమవారం మహదేవపూర్ మండలం పెద్దంపేట గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐతో కలిసి ఎస్సై పవన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అన్నారు. నిందితులు, అనుమానితులను గుర్తించడంలో, కేసుల చేదనలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణకు అందరూ సహకరించాలని, నిఘా నేత్రాలతో ప్రజలకు మరింత రక్షణగా ఉంటుందన్నారు. గ్రామంలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నిషేధిత పదార్థాలైన గుడుంబాను ప్రోత్సహించొద్దని, ఒకవేళ ఎవరైనా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత బాగా చదువుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. ప్రజలకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా, అన్నివేళలా పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడు భిక్షపతిని ప్రభుత్వం గుర్తించాలి



సమ్మక్కకు పూజలు చేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: జిల్లాకు మేడారం సమ్మక్క–సారాలమ్మ పేరు నామకరణం చేయాలని అనేక ఉద్యమాలు నిర్వహించిన ముంజల భిక్షపతిగౌడ్‌ను ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ టూ వీలర్స్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు, పూర్వ (పీడీఎస్‌యూ) ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుడు మహమ్మద్ జాఫర్ అన్నారు. సోమవారం జిల్లా సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ముంజల భిక్షపతి గౌడ్‌తో కలిసి ఆయన వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవార్ల ఆశీస్సులతోనే జిల్లా ఏర్పడిందన్నారు. జిల్లాకు వనదేవత పేరు పెట్టాలని ఉద్యమకారుడు ముంజల భిక్షపతి ఉద్యమాలు చేశారన్నారు. మంత్రి సీతక్క ఆయన సేవలను గుర్తించి జిల్లాలో నామినేటెడ్ పోస్ట్ ఇవ్వాలని సమ్మక్క సారక్క మన దేవతల సాక్షిగా ప్రార్థిస్తున్నానని అన్నారు. భిక్షపతి చిన్నప్పటి నుంచి ఉద్యమకారుడని ఆయనకు ఇప్పటి వరకు న్యాయం జరగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులను గుర్తిస్తామని హామీ ఇచ్చిందని మంత్రి సీతక్క కూడా ఉద్యమ నాయకురాలేనని ఉద్యమకారుడైన నిస్వార్థపరుడైన భిక్షపతిగౌడ్ కు తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. నాయకులు మహమ్మద్ సాదిక్, మహమ్మద్ ఆలీ నారాయణ, రమేష్ పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

వెంకటాపురం(ఎం): మండలంలోని లక్ష్మీదేవిపేటలో అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలం నుంచి ఇటీవల ఉపాధ్యాయులుగా నియమాకమైన 13 మందిని శాలువాలతో సన్మానించినట్లు కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు సర్వర్ అహ్మద్ తెలిపారు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టబోతున్న ఉపాధ్యాయులను అభినందించి విద్యార్థులకు ఉత్తమమైన విద్యను బోధించి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని సర్వర్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు కొండపర్తి సదానందం, మాజీ సర్పంచ్ గట్టు కుమారస్వామి, వివిధ సంఘాల నాయకులు కొత్తపెల్లి ఆనందం, అల్లం ఓదేలు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానంలో పులిహోర లేదట!

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో భక్తులకు పులిహోర ఉదయం వేళల్లో సరిగ్గా లభించడం లేదని సోషల్ మీడియాలో రెండు రోజులుగా వైరల్ అవుతోంది. దేవస్థానం అధికారులు పులిహోర తక్కువ స్థాయిలో తయారు చేయడం వల్ల ఉదయం 11గంటల వరకు మాత్రమే లభిస్తుంది. కాగా, ఆదివారం మహదేవపూర్‌కు చెందిన పారాలీగల్ వలంటీర్ సందీప్‌రాజ్ తన కుటుంబ సభ్యులతో కలసి దేవస్థానానికి వచ్చి దర్శనం చేసుకున్నాడు. అనంతరం ఉదయం 10.30 గంటలకు పులిహోర తీసుకోవడానికి ప్రసాదశాల కౌంటర్ వద్దకు వెళ్లాడు. అక్కడ పులిహోర స్టాక్ లేదని, లడ్డు ఉందని దేవస్థానం ఉద్యోగులు బదులిచ్చాడు. షుగర్‌తో ఉన్న వారు పులిహోర కోసం వస్తారని, భక్తులకు అందడకుండా దేవస్థానం అధికారులు కొద్దిగా తయారు చేయడం ఏంటని ప్రశ్నించిన వీడియో సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అవుతోంది. అధికారులు స్పందించి భక్తులకు కనీసం ఒంటి గంట వరకు పులిహోర అందేలా చర్య తీసుకోవాలని పోస్ట్‌లో సూచించారు. రెండు వీడియో రోజులుగా వైరల్ అవుతున్న దేవస్థానం అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

మిర్చి నారుకు డిమాండ్

- చనిపోతున్న మిర్చి మొక్కలు
- లబోదిబోమంటున్న రైతులు
- భారీగా ధర పెంచి విక్రయాలు



చనిపోతున్న మిరప మొక్కలు

వాజేడు: ఆదిలోనే హంస పాదులా నాటిన మిర్చి నారు చనిపోతుంది. వేలాది రూపాయలు ధర వెచ్చించి మిర్చి విత్తనాలను కొనుగోలు చేసి పెంచిన తరువాత మొక్కేతలను (మిర్చి మొక్కలు పాతడం) వేస్తే అవి కాస్తా చనిపోతున్నాయి. ఐదు ఎకరాలను సాగు చేసే రైతు సుమారుగా రెండున్నర కేజీల విత్తనాలను నారుగా పోశారు. ఆ నారు సుమారుగా 15 ఎకరాల ఎకరాలకు సరిపోవాలి. కాని ఐదు ఎకరాలకు కూడా సరిపోని దుస్థితి. మొక్కేతలు వేసిన తరువాత రైతులకు ఉబ్బరపు ఎండల రూపంలో చావుదెబ్బ కొడుతున్నాయి. మొక్కలు ఎండకు మల మల మాడి చనిపోతున్నాయి. ఎన్ని తడులు(నీటిని) పెట్టినా మొక్కలు బతుకకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటాల్సి ఉంటుంది దీంతో రైతుల దగ్గర నారు లేకపోవడంతో వేరే రైతులను ఆశ్రయిస్తున్నారు.

నారుకు ధర పెంచిన రైతులు

నాటిన మొక్కలు చనిపోవడం, రైతులకు నారు అవసరం కావడంతో నారు మిగిలిన వారు, ఎక్కువ నారును పోసిన వారు ఇదే అదనుగా డిమాండ్‌ను పెంచి ఎక్కువగా ధరకు విక్రయిస్తున్నారు. ఒక రైతు నాటిన మొక్కలు మొత్తం చనిపోవడంతో నారు కోసం ప్రయత్నించగా ఎకరానికి కూడా చాలని నారుకు రూ.30000 వరకు డిమాండ్ చేసినట్లు చెప్పారు. ఆ నారు తెచ్చి పాతగా ముప్పావు ఎకరానికి సరిపోయిందని వాపోయాడు. నారుకు కొరత రావడంతో మిర్చి నారు డిమాండ్‌ను పెంచి విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. తోటి రైతులకు నారు సరిపోకపోతే తమకు మిగిలిన, ఎక్కువ పోసిన నారుకు ఖర్చులను చూసుకుని విక్రయించడం ప్రతీ ఏటా జరుగుతుంది. ఇప్పుడే భారీ ఎత్తున ఖర్చు చేస్తున్న రైతులు తీరా కాయలకు ధర లేకపోతే ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

చట్టాల పరిరక్షణకు పోరాటం

వెంకటాపురం(కె): ఆదివాసీ చట్టాలు, వాటి పరిరక్షణ కోసం ఆదివాసీలు రాజీలేని పోరాటాలు చేయలని పిలుపునిచ్చారు. తెలంగాణ భూమిపుత్ర ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనెం రామచందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో తెలంగాణ భూమిపుత్ర ఆదివాసీ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమవేశానికి ముఖ్య అతిథిగా రామచందర్ హాజరై మాట్లాడారు. ఆదివాసీ ఉద్యమల్లో యువత భాగస్వామ్యం కావాలని అన్నారు. అనంతరం ఆయన సమక్షంలో సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాటి లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడిగా కుడుముల నిరంజన్, ప్రధాన కార్యదర్శిగా కోరం ప్రసాద్, కార్యదర్శిగా పూనెం నాగరాజు, సహాయ కార్యదర్శిగా బుగ్గం క్రాంతి కుమార్, కోశాధికారిగా పూనెం పవన్ కుమార్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసం నవీన్ కుమార్, తెల్లం చందు మోహన్‌రావు తదితరులు ఉన్నారు.